# శర్కరాయణం

## "లతిక"

[ఒక పెద్ద చెంచా — టేబుల్ చెక్కెరలో సుమారు 31 'కాలరీ'ల శక్తి ఇమిడి ఉంటుందిట ఒక పెద్ద చెంచాడు మైదాపిండిలో—మరొక రకం పిండి అనుకున్నా ఫరవాలేదు- ఇంచుమించు 29 కాలరీలు ఉంటాయట

తక్కిన దేశాలలో ఖర్చు అయినంతగా మన దేశంలో పంచదార ఖర్చుఅవదు 1959లో సంవత్సరానికి మనిషికి సుమారు 5 3 కిలోగ్రాంలు (ఒక కి.గ్రాం సుమారు 2.2 పవున్లలో సమానం) వున్నట్లు లెక్కవేశారు. అమెరికాలో 43 7, రష్యాలో 39.6, పాకిస్తాన్‌లో 2.3, బ్రిటన్‌లో 52.8, జపాన్‌లో 14.7. ప్రస్తుతం ఈ దేశంలో సుమారు 12.7 కిలోలు (మనిషికి, సంవత్సరానికి) ఖర్చు అవుతున్నాయట.

మద్రాసు 38.58, మహారాష్ట్ర 29 66, ఉత్తరప్రదేశ్ 9.16.]

"పరమ సాధ్వీమతల్లి యూ పంచదార" అంటూ అవధానికి సమస్య ఇచ్చారు పూరించమని! అష్టావధాని ఆలోచించాడు. సమయానికి స్ఫురించింది. సమయస్ఫూర్తితో, "పంచదార" అన్న పదాన్ని ద్రౌపదికి అన్వయిస్తూ పూరించాడు. పంచ అనగా అయిదుగురికి, దార అనగా భార్య అని ప్రతిపాదిస్తూ! కరతాళ ధ్వనుల కోలాహలంతో మా మండలి హాలంతా దద్దరిల్లింది.

అయితే నేను ప్రస్తుతం వ్రాయబోయేది పంచ పాండవులకు దార అయిన ద్రౌపది గురించి కాదు. ఈనాడు చాలా మందికి దుర్లభమైపోయి, దాదాపు మృగ్యమైపోయిన పంచదార గురించి.....

ఈ పంచదారకి నానా నామాంతరాలున్నాయి. శర్కర, చక్కెర, చీనీ ఇత్యాదులు ఈ శర్కర సాహిత్యంలో (అదే సాహిత్యంలో చక్కెర) చాలా కాలంగా స్థాన మేర్పరుచుకుంది. చాలా కాల మేమిటి? శ్రీనాథుని ప్రాతల్నిబట్టి, వ్యాసుడి కాలం నుంచీ కూడా వినియోగింపబడుతోందని రూఢీ అవుతోంది. ఎలాగంటారా? భీమఖండంలో కండ చక్కెర వుంది. రామాయణంలో పిడకల వేటలా శర్కరామాయణంలో భీమాయణం ఇది.

ఈ కథ (వ్యాసుడి కథ) అష్టాదశ పురాణాలలో ఒకటైన స్కాంద పురాణంలోనిది. శ్రీనాథుడా పురాణం సేకరించి, పరిశీలించి, సారం గ్రహించి, అందులోని ఇతివృత్తం సంగ్రహించి భీమఖండం లేక భీమేశ్వర పురాణం సృష్టించాడు.

అది నేను వ్రాస్తాను. పత్రికలో వేస్తారు. మీరు (చూస్తే) చూస్తారు. చూడ్డం వేరు—చదవడం వేరు. చూసి, చదవండి చదివి చూడండి!

ఓసారి శిష్యులను కాశీ ఎక్స్‌కర్షన్ తీసుకు వెళ్ళాడు వ్యాసుడు కాశీలో వారికి వారం రోజులు తిండి తిప్పలూ లేవు సారీ! తిండే లేదు! తిప్పలున్నాయి. తిండిలేక తిప్పలు పడ్డారు వ్యాసుడికి కాశీ మీద కోపం వచ్చింది. ..

"ధనము లేకుండెదరు, మూడు తరములందు
మూడు తరములు చెడుగాక మోక్షలక్ష్మి
విద్యయును మూడు తరములు వెడలవలయు
పంచ జనులకు కాశికా పట్టణమున......"

మూడు పురుషాంతరాలపాటు కాశీలోని పంచ వర్ణముల జనులకూ, ధనం, మోక్షం, విద్య లేక పోవుగాక— అని శపించబోయాడు. అతని ఆకలి బలహీనతమీద ఇంకా ఆడుకోడం వేడుకనిపించ లేదు కాశీ అన్నపూర్ణ తల్లికి! తెగేదాకా లాగడమెందుకని, వ్యాసుని ఆగ్రహం అరికట్టడానికి, అనుగ్రహించి, అతనికి, శిష్యులకీ ఆతిథ్య మిచ్చింది. ఆకలిగొన్న శార్దూలాల్లా వ్యాసుడూ, శిష్యులూ ఆరగించేరేమో! శ్రీనాథుడు శార్దూల వృత్తంలో ఆతిథ్యం గురించి, భోజన సామగ్రి గురించి బహు పసందుగా వర్ణించాడు. చిత్తగించండి ....

"ద్రాక్షా పానక, ఖండ శర్కరలతో,
రంభా ఫల శ్రేణితో,
గోక్షీరంబులతోడ, మండెగలతో
గ్రాజ్యేతితో బప్పుతో
నక్షయ్యంబగు నేరు బ్రాలకల మా
హారంబు నిశ్శంకతం
గుక్షుల్ నిండగ. ...."

అన్నపూర్ణాదేవి ఆరగింప జేసిందట.

ఇంతకూ చెప్పరావడ మేమిటంటే, ఈ పంచదార ఆనాటిది! ఆనాటిది కాదు అనుకుంటే, కనీసం శ్రీనాథుడి నాటిది అనేనా ఒప్పుకోవాలి. కావాలంటే పోతన సాక్ష్యం కూడా ఉంది. ఆయన గంటం పంచదారలో ముంచి మరీ భాగవతం వ్రాశాడు. ఇంకా నమ్మకపోతే "కరుణశ్రీ" గారిని అడిగి చూడండి.

"ముద్దులుగార భాగవత
మున్ రచియించుచు, పంచదారలో
నద్దితి వేమొ గంటము, మ
హాకవి శేఖర! మధ్య మధ్య—అ
ట్లద్దక పట్టి గంటమున
నట్టిటు గీచిన తాటి యాకులో
పద్దెములందు ఆ మధుర
భావము లెచ్చటి నుండి వచ్చు......?"

అంటూ ఎదురు ప్రశ్న వేస్తా రాయన!

సరే! బాగానే ఉంది! పురాణాలలోను, ప్రబంధాలలోనూ, కావ్యాలలోనూ, ఖండ కావ్యాలలోనూ ఇతరత్రా, ఇతరత్రా దర్శన మిచ్చిన పంచదార ఈనాడు అసియా ఖండంలో ఉప ఖండమైన ఇండియాలో గగనారవిందమైంది. గగనారవింద మంటే? ఆకాశంలోని అరవింద పుష్పం! ఆ గగనారవిందమేనా ప్రయత్నిస్తే దొరుకుతుందేమోగాని, కొనుక్కున్నా (కుందామన్నా) పంచదార మాత్రం కంట్రోలు మూలంగా దొరకడంలేదు.

పంచదార ఇబ్బంది వుంది శ్రావణ మంగళవారాలకీ శుక్రవారాలకీ మాఘ ఆదివారాలకీ చక్కెర పరమాన్నంలేదు. లేకపోవడంలోని ఇబ్బంది అందరూ అనుభవిస్తూనే ఉన్నారు. ఇబ్బంది గురించి నేను వేరే వ్రాయడ మెందుకు?

మీరు కోప్పడమనీ హామీ ఇస్తే, చక్కెర కొరతవల్ల వచ్చే లాభాన్ని గురించి మనవి చేస్తాను. ఠాట్! మేం కాదంటే, గుడ్డొచ్చి పిల్ల నెక్కిరించినట్టు — నువ్వవునంటావా అని మాత్రం ఆగ్రహించకండి. హాఫీ! నియంత్రణవల్ల లాభంలేదు—వూరికే వెరైటీకోసం, నేను వ్రాసేది చదవండి!

చక్కెర ఎక్కువగా వాడితే షుగర్ కంప్లెయింట్ వ—స్తు—ం—ద—ని రూఢిగా చెప్పలేం కాని, తక్కువ వాడితే మాత్రం బోలెడంత మేలు జరుగుతుంది. ఐహికంగా, ఆముష్మికంగా లాభం లభించి తీరుతుంది

షడ్రుచులలో ఒకటి మాధుర్యం. ఈ ఆరు రుచులకీ, అలవాటు పడ్డవాళ్ళు, అరిషడ్వర్గాన్ని జయించలేదు. జిహ్వా లాలసత్వానికి లోబడకండి విగ్రహించుకోండి! శత్రు షట్కం ఇట్టే మీ వశమౌతారు.

చీనీ మీద భ్రాంతిని వదులుకోండి
చీనా వాళ్ళని జయించి తీరుతారు.

ఇదేదో ప్రచార సాహిత్య మనుకుంటున్నారా? నేను ప్రభుత్వోద్యోగినికాను. నాకే ఉద్యోగంలేదు. నాకున్నదల్లా ఒకటే ఉద్యోగం! దొరికింది చదవడం, తోచింది వ్రాయడం. అంతే! శ్రీనాథుని భీమఖండం, కరుణశ్రీగారి, ఉదయశ్రీ చదివేను. ఈ శర్కరాయణం వ్రాశాను. ఈ చక్కెర పరమాన్నం మంచి ఇక, చక్ర భ్రమణమే—చదివి, వ్రాసి, నేను వ్రాసి, మీరు చదివి........యిలా! ★